# ''వక్ర వ్యాకరణం''

**--వంగూరి చిట్టెన్ రాజు, హ్యూస్టన్, టెక్సస్**

తెలుగు వ్యాకరణంలో పురుష (షు) లు మూడు రకాలు. ప్రథమ పురుష అంటే ఉత్తమం. ద్వితీయ పురుష మధ్యమం. తృతీయ పురుషుడెప్పుడూ అధముడే! ఉదాహరణకి:

**నేను ఇష్టమైనవి తింటాను.**
**నువ్వు అన్నీ చూసుకుని తింటే మంచిది.**
**వాడు శుద్ధ తిండిపోతు, ఆవులూ, గేదెలూ కూడా లాగించేస్తాడు.**

మా పిల్లలు చెప్పిన మాట వింటారు. బుద్ధిమంతులు, నైస్ కిడ్స్.
నీ పిల్లల్ని కొంచెం అదుపులో పెట్టాలేమో
వాడి పిల్లలా, అమ్మ బాబోయ్, ఇంటికొస్తారంటేనే భయం.

**నీకు తెలుసుగా, నేను కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడాతానోయ్.**
**నువ్వు కొంచెం ఆలోచించుకుని మాట్లాడితే మంచిది సుమా.**
**వాడా, వాడూ నోటికొచ్చినటల్లా పేల్తాడు, ఏం చూసుకునో?**

నాకు కోపం ఎక్కువగా రాదు. వచ్చినా వెంఠనే మర్చిపోతాను.
నువ్వు కొంచెం ఆవేశం తగ్గించుకుంటే మంచిది.
వాడు ఉత్త కోపిష్టి వెధవ, ఎప్పుడో దెబ్బలు తింటాడు, చూస్తూ ఉండు.

**మా ఇల్లు మాకు పెర్ఫెక్ట్‌గా ఉంటుంది.**
**మీ ఇల్లు మెయిన్‌టైన్ చెయ్యడం కష్టం కాదూ.?**
**వాడు గొప్పకి పోయి ఆ కష్టం హౌస్ కట్టించి, పేమెంట్లు కట్టలేక చస్తున్నాడు.**

మా ఆవిడ వెరీ అండర్‌స్టాండింగ్, సావిత్రిలా ఉంటుంది అంటారు అందరూ.
మీ ఆవిడ పరవా లేదు. నాట్ బాడ్ ఎటాల్.
వాడి పెళ్ళామా, సూర్యాకాంతమే. ఎలా భరిస్తున్నాడో?

**నేను టెల్గూ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు మంచి ప్రొగ్రాములతో అదరగొట్టేశాను.**
**నాకు బాగా జ్ఞాపకం, నువ్వు ప్రెసిడెంట్‌గా ఉన్నప్పుడు పాపం, చాలా అవస్త పడ్డావు.**
**వాడా? అంతా సెల్ఫ్ ప్రమోషనే. వాళ్ళమ్మాయి డాన్సులు అస్తమానూ చూళ్ళేక అందరికీ ఒళ్ళు మడిపోయిందనుకో.**

నా కథలూ, కవితలూ చాలా గొప్పగా, కొత్త పంథాలో ఉంటాయి.
నువ్వు కొన్ని, కొన్ని, బాగానే రాస్తావు.. కీప్ ఇట్ అప్...
వాడి మొహం, వాడికి తెలుగు రాయడమే రాదు....